క్లుప్తంగా

కేసీఆర్ బహిరంగ సభను జయప్రదం చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్

అక్కన్నపేట(హుస్నాబాద్): ఈనెల 12వ తేదీన కరీంనగర్ జిల్లాలో మాజీ సీఎం కేసీఆర్ నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే సతీష్‌కుమార్ పిలుపు ఇచ్చారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని మర్రిచెట్టు కింద పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థులే గెలవబోతున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయకపోతే ఎండగడతామన్నారు. సమావేశంలో ఎంపీపీ మాలోతు లక్ష్మీ, జెడ్పీటీసీ సభ్యురాలు భూక్య మంగ, పార్టీ మండలాధ్యక్షుడు పెసరు సాంబరాజు, ప్రధాన కార్యదర్శి రవీందర్, మాజీ జెడ్పీటీసీలు మాలోతు భీలునాయక్, మాలోతు రాంచందర్ నాయక్, మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ అశోక్‌బాబు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయి స్థాయి పోటీలకు ఎంపిక

మద్దూరు(హుస్నాబాద్): జాతీయ సీనియర్ మహిళల హ్యాండ్ బాల్ పోటీలకు మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామానికి చెందిన స్వర్ణ ఎంపికైనట్లు మెదక్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయబాబు గురువారం తెలిపారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని స్వర్ణ రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. ఈనెల 16 నుంచి 20వ తేదీ వరకు దాద్రనగర్ హవేలిలో నిర్వహించనున్న జాతీయ సీనియర్ మహిళా హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. స్వర్ణను హ్యాండ్ బాల్ అసోషియేషన్ ప్రతినిధులు, అధ్యాపకులు, గ్రామస్తులు అభినందించారు.

సంతుశ్రీ రామారావుకు భారతరత్న ఇవ్వాలి


మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్

అక్కన్నపేట(హుస్నాబాద్): సంతుశ్రీ రామరావు మహారాజ్‌కు భారత రత్న ఇవ్వాలని మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ డిమాండ్ చేశారు. అక్కన్నపేట మండల కేంద్రం పరిధిలోని చౌడుతండాలో గిరిజన నేత ధరావత్ తిరుపతినాయక్ ఆధ్వర్యంలో సంతు సేవాలాల్ మహారాజ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన యువతులను ఎందుకు హీరోయిన్లుగా పెట్టడంలేదని ఓ సినీ నిర్మాతను అడిగానన్నారు. గిరిజనులు కూడా హీరో హీరోయిన్లుగా రాణించేలా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఓ ఆర్డినెన్స్ తీసుకొచ్చేలా కృషి చేస్తానన్నారు. అలాగే 6, 8వ తరగతి పాఠ్య పుస్తకాల్లో శ్రీ సంతు సేవాలాల్ మహారాజ్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని డిమాండ్ చేశారు. సేవాలాల్ మహారాజ్, అంబేద్కర్‌ను యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరామ్ జయంతిని..

చిన్నకోడూరు(సిద్దిపేట): ఈనెల 15వ తేదీన బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ జయంతిని సిద్దిపేటలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి తెలిపారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సామాజిక న్యాయం కోసం, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి, బహుజనుల హక్కుల కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి కాన్షీరామ్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి రోమాల బాబు, సిద్దిపేట అసెంబ్లీ అధ్యక్షులు పుల్లూరి ఉమేష్, నాయకులు పాల్గొన్నారు.

శంభునికి అన్నపూజ



విశేష అలంకరణలో పరమేశ్వరుడు

వర్గల్(గజ్వేల్): నాచగిరిలోని శివాలయంలో శివరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు గురువారం ఉదయం నవగ్రహ హవనం, రుద్ర హవనం నిర్వహించారు. లింగస్వరూపుడైన పరమేశ్వరుడికి అన్నపూజ చేశారు. నేత్రపర్వంగా సాగిన వేడుకల్లో భక్తులు పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఉచిత శిక్షణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రూప్ 1 ప్రిలిమ్స్ అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 12వ తేదీలోగా స్థానిక బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.


కొండపాకలో మహా శివరాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైన రుద్రేశ్వరాలయం


ఖాతలోని మహాదేవుని ఆలయం, పవిత్ర గుండం


సోమేశ్వర ఆలయం


సిద్ధేశ్వర స్వామి దేవాలయం


సలెంద్రిలోని రామలింగేశ్వర ఆలయం

ఆలయాలు ముస్తాబు

మహా శివరాత్రిని పురస్కరించుకొని శైవక్షేత్రాలు ముస్తాబయ్యాయి. విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్షేత్రాలకు వచ్చే భక్తులు దర్శనానికి ఇబ్బంది పడకుండా ఆలయ నిర్వాహకులు, అధికారులు ఏర్పాట్లు చేశారు. మహా శివరాత్రికి ఉపవాసాలు చేపట్టే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.


లడ్డూ ప్రసాదము తయారు చేస్తున్న కార్మికులు


తొగుట మండలంలోని రాంపురం కోటిలింగాల దేవాలయం


లక్ష్మీపూర్‌లోని కాశీలింగేశ్వర ఆలయం


తిగుల్‌లో పార్వతీ పరమేశ్వర ఆలయం

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం


సిద్దిపేటలో కేక్ కట్ చేస్తున్న సిద్దిపేట రూరల్ ఎస్ఐ అపూర్వరెడ్డి


సిద్దిపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో..


వర్గల్‌లో..


గజ్వేల్ మండల పరిషత్ కార్యాలయంలో ..


పెద్ద మాసాన్‌పల్లిలో..

అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో మహిళా అధ్యాపకులు, ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన కార్మికులు, ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బందిని, ఆర్టీసీ డిపోల్లో మహిళా కండక్టర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. మహిళలు ఆత్మన్యూనత వదిలి స్వేచ్ఛగా ముందుకు సాగాలన్నారు. భారతీయ చట్టాలు మహిళలకు అన్ని విధాలుగా అనుకూలంగా ఉన్నాయని మహిళా పోలీసులు అధికారులు అన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శం

ప్రముఖ రచయిత్రి సజయ

సిద్దిపేట ఎడ్యుకేషన్: సావిత్రి బాయి పూలే జీవితం నేటి తరానికి ఆదర్శమని ప్రముఖ రచయిత సజయ అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. నాటి మహిళల్లో సావిత్రి బాయి గొప్ప సామాజిక స్ఫూర్తిని నింపిందన్నారు. తన భర్త సహకారంతో అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. అనంతరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారత దేశంలోని మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా పనిచేసి అనేక సామాజిక కార్యక్రమాలను నిర్వహించిందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్,


మాట్లాడుతున్న ప్రముఖ రచయిత్రి సజయ

చరిత్ర విభాగాధిపతి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, కోఆర్డినేటర్లు డాక్టర్ మల్లేశం, డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రద్ధానందం, గురుమూర్తి, డాక్టర్ కొండల్ రెడ్డి, డాక్టర్ హరిబాబు, భిక్షపతి, నాగేశ్వరరావు, గణేష్, రఘుపతి, శ్రీనివాస్, దేవదాస్, తదితరులు పాల్గొన్నారు.

మెదక్ ఎంపీ టికెట్ ఇవ్వాలి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మెదక్ పార్లమెంట్ టికెట్ కుమ్మరులకు కేటాయించాలని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం గురువారం అన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నలుగురు బీసీలకు ఎంపీ టికెట్లు ఇవ్వాలని నిర్ణయించినందున, రాజకీయాల్లో కుమ్మరి కులానికి ప్రాధాన్యత లేనందున టికెట్ తనకు ఇవ్వాలని కోరారు. పార్టీ అధికారంలో లేకున్నా కృషిచేశానన్నారు.

బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శిగా..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి గ్రామానికి చెందిన కర్ణకంటి నరేష్ భారతీయ జనతా యువమోర్చా(బీజేవైఎం) జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెండోసారి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు దినేష్ ఆయనకు నియమాక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ పార్టీని బలోపేతం చేయడమే తన లక్ష్యమన్నారు.

తైక్వాండో క్రీడాకారిణికి అభినందనలు


పూజను అభినందిస్తున్న సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: ఇటీవల పాండిచ్చేరిలో జరిగిన తైక్వాండో చాంపియన్ షిప్‌లో మెడల్ సాధించి, ఈనెల 9 నుంచి 11వరకు ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరిగే పోటీలకు క్రీడాకారిణి పూజ ఎంపికైంది. ఆమెను గురువారం సీపీ అనురాధ అభినందించారు. జాతీయ స్థాయిలో ఇండియా తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో తైక్వాండో జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ రాంమోహన్, అసోసియేషన్ సభ్యుడు రమేష్, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్‌తో ప్రజలకు న్యాయం

సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎల్ఆర్ఎస్ కట్టని ప్రజలకు లబ్ధి చేకుర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ తెచ్చిందని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. గురువారం సిద్దిపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఖజానాను నింపుకోవడానికి మాత్రమే ఎల్ఆర్ఎస్‌ను తీసుకొచ్చినట్లుగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం సరికాదన్నారు. పేద ప్రజలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు నష్టపోకూడదని రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్‌ను కొనసాగిస్తుందన్నారు. ఈ విషయంపై బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవపట్టిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ కార్యదర్శి మధు, యువజన పట్టణ అధ్యక్షుడు గయాజుద్దీన్, రశాద్, నజ్జు, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అత్తు ఇమామ్

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా శ్రీనివాస్


నియామక పత్రాన్ని అందజేస్తున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దుబ్బాకటౌన్: సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధిగా మచ్చ శ్రీనివాస్ నియమితులయ్యారు. గురువారం ఈ మేరకు నియామకపు పత్రాన్ని దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మచ్చ శ్రీనివాస్ మాట్లాడుతూ పార్టీ బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, దుబ్బాక నియోజకవర్గం ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

రైతాంగానికి నష్ట పరిహారం చెల్లించాలి

భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్ రెడ్డి

హుస్నాబాద్: ప్రకృతి వైపరీత్యాలకు నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా ఉపాధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎలీనా, ఎండల ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటి పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం హుస్నాబాద్, అక్కన్నపేట మండలాల్లో ఎండిన పంటలను పరిశీలించారు. వరి, మొక్కజొన్న పంటలకు నీరందక ఎండిపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. యుద్ధ ప్రాతిపదికన అధికారులు నష్టం అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు పంపాలన్నారు. ఎకరాకు రూ. 30 వేల నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ఎండిన పంటలకు నష్టపరిహారం అందించేలా కృషి చేయాలని కోరారు.


ఎండిన పంటను చూపిస్తున్న రైతు వేణుగోపాల్ రెడ్డి

సీపీని కలిసిన టాస్క్‌ఫోర్స్ నూతన ఏసీపీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ నూతన ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన రవీందర్, గజ్వేల్ డివిజన్ నూతన ఏసీపీ పురుషోత్తంరెడ్డి సీపీ అనురాధను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. సీపీ వారిని అభినందించారు. జిల్లాలో గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, పీడీఎస్ రైస్, ఇసుక అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని వారికి సీపీ సూచించారు.


పూలమొక్క అందజేస్తున్న ఏసీపీ రవీందర్

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

మిరుదొడ్డి(దుబ్బాక): కడుపు నొప్పి బాధ భరించలేక ఓ యువతి ఆత్మహత్యకు యత్నించింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. మిరుదొడ్డి ఎస్ఐ పర్శరామ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అందె గ్రామానికి చెందిన దండబోయిన శ్యామల, స్వామి దంపతుల కూతురు మానస (19) ఇంటర్ వరకు చదివి ఇంటివద్దనే ఉంటుంది. కొద్ది రోజులుగా కడుపు నొప్పితో బాధ పడుతోంది. నొప్పి తీవ్రమవుతుండటంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 5వ తేదీన గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. గమనించిన తల్లిదండ్రులు సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి పేటలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం తుదిశ్వాస విడిచింది. మృతురాలి తండ్రి స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

తడ్కపల్లి గ్రామంలో..

సిద్దిపేట అర్బన్: కడుపునొప్పి భరించలేక రైతు ఆత్మహత్యకు యత్నించాడు. ఆసుపత్రిలో చికిత్సపొందుతూ గురువారం మృతి చెందాడు. సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని తడ్కపల్లి గ్రామానికి చెందిన అంబటి మధు (45) వ్యవసాయం చేస్తున్నాడు. ఈనెల 2వ తేదీ సాయంత్రం పొలం వద్ద కడుపునొప్పి రావడంతో క్రిమిసంహారక మందు తాగి ఇంటికి వచ్చి పడిపోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్‌లో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు అనిల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సంక్షిప్త వార్తలు

◆ ఆరు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నంగునూరు(సిద్దిపేట): అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఆరు ట్రాక్టర్లను గురువారం తెల్లవారుజామున పట్టుకున్నట్లు రాజగోపాల్‌పేట ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. అక్కేనపల్లి వాగులో ఇసుక తోడుతున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. నూనె రాజు, జంగోని శ్రీనివాస్, సందెబోయిన మల్లేశం, తిప్పని చంద్రశేఖర్, వుదరి వంశీ, గోనెపల్లి మల్లయ్య ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

◆ వాటర్‌ప్లాంట్‌ను పునరుద్ధరించాలి

కొమురవెల్లి(సిద్దిపేట): ఆలయ పరిసరాలలో తాగు నీటి కోసం దాతలు ఇచ్చిన వాటర్ ప్లాంట్‌ను పునరుద్ధరించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. దాతలు ఇచ్చిన వాటర్ ప్లాంట్ నిర్వహణపై ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎండలు పెరుగుతున్న దృష్ట్యా భక్తులకు తాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన ఆలయ ఈవో చోద్యం చూస్తున్నాడని ఆరోపించారు. భక్తులకు తాగునీరు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు నీటిని విక్రయిస్తున్నారన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, తాడూరి రవీందర్, దాసరి ప్రశాంత్, తేలు ఇస్తారి, సార్ల యాదయ్య, వుల్లంపల్లి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

◆ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శివారులోని ఎల్లంపల్లె మోడల్ స్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యతపై కేడీసీసీ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ రవీనా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో పీఎంశ్రీ పథకంలో భాగంగా గరల్స్ ఎంపవర్‌మెంట్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హర్జిత్‌కౌర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

◆ జాతర ఏర్పాట్ల పరిశీలన

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పొట్లపల్లి మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను గురువారం తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్ పరిశీలించారు. ఒక రోజు జరిగే జాతరకు వివిధ గ్రామాల నుంచి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా స్వామి దర్శనం చేసుకొనేందుకు క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. చలువ పందిళ్లు వేశామని, భక్తులకు భోజనం, తాగునీరు ఏర్పాటు చేసినట్లు ఈఓ కిషన్‌రావు తెలిపారు.

◆ ఘనంగా అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

గజ్వేల్‌రూరల్: మండల పరిధిలోని కోమటిబండగుట్టపైగల శ్రీసంగమేశ్వరస్వామి దేవాలయ సన్నిధిలో గురువారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహం, ధ్వజస్తంభ ప్రతిష్ఠలు నిర్వహించారు. ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రతిష్ఠాపన పూజలకు హాజరై పూజలు చేశారు.

◆ సీఎస్‌బీ సీఐ బదిలీ

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలోని సీఎస్‌బీలో సీఐగా విధులు నిర్వహిస్తున్న సత్యనారాయణరెడ్డిని వరంగల్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు రాష్ట్ర పోలీసుశాఖ ఉన్నతాధికారుల నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

◆ వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో మృత్యుంజయ, గణపతి, హనుమాన్, సుబ్రహ్మణ్యేశ్వరస్వాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయంలో హోమాలు, యజ్ఞాలు తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమాలు శుక్రవారంతో ముగియనున్నాయి. పూజల్లో వైశ్యభవన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

◆ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొండపాక(గజ్వేల్): మండల కేంద్రమైన కొండపాకలోని రుద్రేశ్వర దేవాలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను తొగుట రాంపూర్ కోటిలింగాల దేవాలయ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ చేతుల మీదుగా అంకురార్పణ చేశారు.

◆ వరిలో తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చేపట్టాలి

జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్

రాయపోలు(దుబ్బాక): వరి పంటకు ఆశించిన తెగుళ్ల నివారణకు సస్యరక్షణ చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి శివప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలోని రామారం రైతులు సాగు చేసిన వరి చేలను గురువారం సందర్శించారు. వరిలో కాండం తొలిచే పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని గుర్తించినట్లు తెలిపారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సలహాలు పాటిస్తే పంటలను కాపాడుకోవచ్చన్నారు. అనంతరం గ్రామంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కాలం చెల్లిన, నకిలీ విత్తనాలను విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.